


# కరపత్రం

SINCE 2014

బుధవారం సెప్టెంబర్ 16,2026 | సంపుటి : 2 | సంచిక : 338 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## 'తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి'

» సెప్టెంబర్ 17 ప్రాధాన్యతను భవిష్యత్ తరాలకు తెలియజేయాలి

» రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్


2 లో

**హైదరాబాద్:**
తెలంగాణ విమోచన దినోత్సవమైన సెప్టెంబర్ 17ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని పలువురు ప్రముఖులు డిమాండ్ చేశారు. అలయ్ బలాయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బండారు విజయలక్ష్మి నేతృత్వంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో "తెలంగాణ విమోచన దినాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ గారు, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్. విద్యాసాగర్ రావు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, కోదండరామ్, అంజిరెడ్డి, ప్రేమ్‌సింగ్ రాథోడ్ , బీఎస్ రాములు, పాశం యాదగిరి, పాదూరి కరుణ గారు తదితర సామాజిక, రాజకీయ, చారిత్రక రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

### యూపీఐ చెల్లింపులకు ఛార్జీలు..

## ట్రంప్‌ను బుజ్జగించేందుకేనా?

» రూ.2 వేల వరకు ఛార్జీలు లేవు.. ఆపై?
» అమెరికా పేమెంట్ కంపెనీల ఒత్తిడికేనా?
» ట్రంప్‌ను బుజ్జగించేందుకే నిర్ణయమా?: ఖర్గే
» మోదీ ప్రభుత్వం అమెరికా ఒత్తిడికి లొంగుతోంది: రాహుల్
» రూ.5 వేల పేమెంట్‌పై రూ.25.. రూ.10 వేలపై రూ.50?
» ద్రవ్యోల్బణం వేళ సామాన్యులపై మరో భారం
» డిజిటల్ చెల్లింపులపై పన్ను వద్దంటూ కాంగ్రెస్ ఆగ్రహం

2 లో



## 22A వ్యవహారంపై విచారణ జరపాలి

» మూడేళ్లు ఎందుకు పట్టింది?: ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్
» భూభారతి పేరుతో 'భూ హారతి' చేస్తున్నారంటూ ఆరోపణ
» 30% కమిషన్లు తీసుకుంటున్నారని విమర్శ
» నిషేధిత జాబితా నుంచి భూముల తొలగింపుపై ఆరోపణలు
» రేవంత్ ప్రతి స్కీమ్ వెనుక స్కాం: కేటీఆర్
» యూసీసీపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం



**ఢిల్లీ:**
22A అవకతవకలపై జ్యుడిషియల్ ఎంక్వైయిరీ జరగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించడానికి మూడేళ్లు ఎందుకు పట్టిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ రోజు ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మూడేళ్లపాటు సెటిల్మెంట్లు చేసుకొని ఇప్పుడు రెగ్యులరైజ్ చేసుకుంటున్నారన్న ఆయన రేవంత్ రెడ్డి ప్రతి స్కీమ్ వెనక ఒక పెద్ద స్కాం ఉంటుందని ఆరోపించారు.
ఆయన మాట్లాడుతూ.."భూభారతి పేరుతో భూ హారతి చేస్తున్నారు. 30% కమిషన్లు తీసుకున్న తర్వాత నిషేధిత జాబితాల నుంచి భూములను తొలగిస్తున్నారు. ఉమ్మడి పౌరస్మృతి తీసుకురావాల్సిన అవసరం ఏమొచ్చింది ఉమ్మడి పౌరస్మృతిపై మా పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. యూనిఫామ్ అని చెప్పి కేవలం ఎన్డీఏ పాలిత రాష్ట్రాలలోనే చట్టం తీసుకువస్తామనడంలో సహేతుకత లేదు" అని ప్రభుత్వాన్ని విమర్శించారు.

### సీఎం రేవంత్‌తో పూర్తి

## అండర్‌స్టాండింగ్

▪ రెండేళ్ల పీసీసీ ప్రయాణం సంతృప్తికరం
▪ పార్టీకి బలం.. కార్యకర్తలకు భరోసా
▪ ఏఐసీసీ ర్యాంకింగ్‌లో తెలంగాణ నంబర్-1
▪ స్థానిక ఎన్నికల్లో 50%కుపైగా బీసీ రిజర్వేషన్లు
▪ కార్పొరేషన్ పదవులు సెప్టెంబర్ నెలాఖరులోగా భర్తీ
▪ క్రమశిక్షణలో భాగంగానే కొండా సురేఖపై చర్యలు


2లో..

**హైదరాబాద్:**
రెండేళ్ల పీసీసీ ప్రయాణం చాలా సంతృప్తికరంగా ఉందని, ప్రజలకు గాంధీ భవన్‌ను మరింతగా దగ్గర చేయగలిగానని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మా మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన ప్రస్తావించారు. 'కార్యకర్తలకు భరోసా, పార్టీకి బలాన్ని ఇవ్వగలిగాం. పార్టీ సంస్థాగతంగా నిర్మాణం చేయగలిగాం. ఈ రెండేళ్లు సజావుగా సాగడానికి.. సీఎం రేవంత్ తో వేవ్ లెన్త్ మ్యాచయింది. సీఎం రేవంత్, ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ పరిపూర్ణ సహకారం నాకు లభించింది. రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధాని చేయాలనేదే..



## నేను చెప్పేవి అబద్ధాలైతే.. రాజకీయాల నుంచి వైదొలగుతా: మాధవరం కృష్ణారావు

**హైదరాబాద్:**
రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో తన గురించి చేసిన ప్రస్తావనపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందించారు. హైదర్‌నగర్‌లో 145, 163 సర్వే నంబర్లలోని భూమి చాలా ఏళ్లుగా రిజిస్ట్రేషన్లు కావట్లేదని మంత్రి తప్పుదోవ పట్టించారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కూడా ఏడాదిపాటు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలిపారు. 22ఏపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీకి రానిస్తే.. 22ఏపై అన్ని ఆధారాలతో నిరూపిస్తానని, తాను చెప్పేవి అబద్ధాలైతే రాజకీయాల నుంచి వైదొలగుతానని కృష్ణారావు అన్నారు.


2లో..

## యువత చెప్పేది వినేందుకు మేం సిద్ధం: నిర్మలా

♦ నాయకత్వ బాధ్యతలు స్వీకరించండి
♦ దేశం కోసం ఏం చేయగలమో ఆలోచించాలి
♦ దేశ ప్రయోజనాలపై రాజీ వద్దు
♦ ప్రపంచ సంక్షోభాల మధ్య భారత్‌కు స్థిరత్వం
♦ 7.8 శాతం వృద్ధిరేటు నమోదు
♦ యువతకు కేంద్రం ఎన్నో అవకాశాలు
♦ సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి

జెన్‌జీ , జెన్ ఆల్ఫా తరాలకు చెందిన యువత కూడా నాయకత్వ బాధ్యతలు స్వీకరించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పిలుపునిచ్చారు. యువత ఆశయాలను వినడానికి దేశం సిద్ధంగా ఉందని.. వారు ముందుకు రావాలని కోరారు. దేశం మనకు ఏం చేసిందని ప్రశ్నించకుండా..

### కొండా సురేఖ వ్యవహారం..

## ప్రభుత్వం కీలక నిర్ణయం

▪ సచివాలయంలో మాజీ మంత్రి ఛాంబర్ లాక్
▪ మూడు పేషీలకూ అధికారులు తాళాలు
▪ ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై వేటు
▪ పలువురిని సొంత శాఖలకు పంపింపు
▪ మంత్రి పదవి నుంచి బర్తరఫ్ తర్వాత కీలక పరిణామం
▪ క్రమశిక్షణ చర్యల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

**హైదరాబాద్:**
మాజీ మంత్రి కొండాసురేఖ అంశంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. సచివాలయంలోని కొండా సురేఖ ఛాంబర్‌కు అధికారులు (మంగళవారం) తాళం వేశారు.


2 లో



## సుప్రీంకోర్టులో హైడ్రాకు బిగ్ షాక్!

» కంటోన్మెంట్ 40 ఎకరాలపై ప్రభుత్వ పిటిషన్ డిస్మిస్
» 219 రోజుల ఆలస్యంతో పిటిషన్ దాఖలు
» హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు
» భూమి శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్‌దేనని హైకోర్టు తీర్పు
» హైకోర్టు ఆదేశాల ఉల్లంఘనపై హైడ్రాపై వివాదం
» కమిషనర్ రంగనాథ్‌పై చర్యలకు గతంలో సింగిల్ జడ్జి ఆదేశాలు
» డివిజన్ బెంచ్ ద్వారా రంగనాథ్‌కు స్టే

2 లో

**న్యూఢిల్లీ:**
సుప్రీంకోర్టులో హైడ్రాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కంటోన్మెంట్‌లోని 40 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనంటూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

### తెలుగు రాష్ట్రాలకు

## 5 లక్షల ఇళ్ల కేటాయింపు

» ఏపీకి 3 లక్షలు.. తెలంగాణకు 2 లక్షలు
» కేంద్రం నుంచి భారీగా ఇళ్ల కేటాయింపు
» ఏపీకి అదనంగా 2.25 లక్షల ఇళ్లు
» తెలంగాణకు అదనంగా 1.25 లక్షల ఇళ్లు
» ఒక్కో ఇంటికి కేంద్రం నుంచి రూ.1.20 లక్షల సాయం
» అదనపు సాయంతో రూ.1.80 లక్షల వరకు లబ్ధి
» మరుగుదొడ్డికి రూ.12 వేల సాయం
» ఆవాస్ ప్లస్ యాప్‌తో పారదర్శక ఎంపిక
» 2--3 ఏళ్లలో ఇళ్ల నిర్మాణం పూర్తి లక్ష్యం


2 లో

**అమరావతి:**
తెలుగు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం 5 లక్షల ఇళ్లు కేటాయించిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

### మహిళా సంఘాల

## బలోపేతమే ధ్యేయం: సీతక్క

▪ కాంగ్రెస్‌ది పేదల ప్రభుత్వమని వ్యాఖ్య
▪ అధికారంలోకి రాగానే రుణమాఫీ
▪ మహిళా సంఘాలకు రూ.4 వేల కోట్ల బకాయిలా?: ఆరోపణ
▪ 60 ఏళ్లు దాటిన మహిళలకూ సంఘాల్లో అవకాశం
▪ త్వరలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీ
▪ మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యం
▪ బీఆర్ఎస్‌పై సీతక్క తీవ్ర విమర్శలు


2లో..

**నిజామాబాద్:**
కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. వెయ్యి రోజుల పాలన సందర్భంగా నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో నిర్వహించిన మహిళా సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు.

### తెలంగాణలో సెప్టెంబర్ 17 నుంచి వర్షాలు..

## ఈ మూడు జిల్లాల వాళ్లు జాగ్రత్త


మిగతాది 2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం సెప్టెంబర్ 16,2026

## కొండా సురేఖ వ్యవహారం..
# ప్రభుత్వం కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి

ఛాంబర్‌లోని మూడు పేషీలకు తాళం వేశారు. అదే విధంగా కొండా సురేఖ పేషీలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించి పలువురిని వారి సొంతశాఖలకు పంపారు. కాగా కొద్దిరోజుల క్రితం కాంగ్రెస్ అధిష్ఠానం కొండా సురేఖను క్రమశిక్షణ చర్యల పేరుతో మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఆమె ఛాంబర్‌కు సైతం అధికారులు తాళం వేశారు.

# సుప్రీంకోర్టులో హైడ్రాకు బిగ్ షాక్!

మొదటిపేజీ తరువాయి

జస్టిస్ దీపంకర్ దత్త ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది.కంటోన్మెంట్‌లోని వివాదాస్పద 40 ఎకరాల భూమి శాంత శ్రీరామ్ కన్ స్ట్రక్షన్‌దేనని గతంలో హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఇది ప్రభుత్వ భూమి అంటూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. అయితే, ఈ పిటిషన్‌ను ఏకంగా 219 రోజుల ఆలస్యంగా దాఖలు చేశారనే కారణంతో జస్టిస్ దీపంకర్ దత్త ధర్మాసనం డిస్మిస్ చేసింది. దీంతో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించినట్లయింది.

ఇదే భూమికి సంబంధించి హైకోర్టు తీర్పును ఉల్లంఘించి, శాంత శ్రీరామ్ కన్ స్ట్రక్షన్ సంస్థ భూమిలో హైడ్రా కూల్చివేతలకు పాల్పడింది. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను పదవి నుంచి తొలగించాలని, ఆయనపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని సింగిల్ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. సింగిల్ జడ్జ్ ఇచ్చిన ఈ ఉత్తర్వులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ డివిజన్ బెంచ్ ద్వారా స్టే పొందడం గమనార్హం.

శాంత శ్రీరామ్ కన్స్ట్రక్షన్ తరపున సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా, న్యాయవాదులు అల్లంకి రమేష్, మహమ్మద్ జీషన్, మమత ఆర్ వాదనలు వినిపించారు.

# తెలుగు రాష్ట్రాలకు 5 లక్షల ఇళ్ల కేటాయింపు

మొదటిపేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించినట్లు వెల్లడించారు. 2024లో కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చేసిన కేటాయింపుల కంటే ఏపీకి అదనంగా 2.25 లక్షలు, తెలంగాణకు 1.25 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి తెలుగు రాష్ట్రాలకు ఇంత పెద్ద మొత్తంలో కేటాయించడం ఇదే తొలిసారని పేర్కొన్నారు.

“2019-24 మధ్య కాలంలో ఏపీకి 1.78 లక్షల ఇళ్లు కేటాయించగా.. దానిలో కేవలం 42వేల ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. 2019-24 మధ్య గ్రామీణ ఆవాస యోజన పథకంలో తెలంగాణ చేరలేదు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి రెండుమూడు సార్లు ఇళ్ల కేటాయింపు కోసం విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం అడిగిన దానికంటే ఎక్కువగానే ఇళ్లు మంజూరు చేశాం. ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్రం తరఫున రూ.1.20 లక్షల ప్రాథమిక ఆర్థిక సాయం అందిస్తాం. అదనపు సాయంతో దాదాపు రూ.1.80 లక్షల వరకు లబ్ధి చేకూరుతుంది. స్వచ్ఛ భారత్ కింద మరుగుదొడ్డికి రూ.12 వేల సహాయం అందిస్తాం. ఆవాస్ ప్లస్ యాప్‌తో పారదర్శకంగా ఎంపిక జరుగుతుంది.

జియో ట్యాగింగ్‌తో లబ్ధిదారుల నమోదుకు కేంద్రం సెల్ఫ్ సర్వే సదుపాయం కల్పించింది. ఆదాయ అర్హత పరిమితి రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మోటార్ బైక్, ఫ్రిజ్ ఉన్నా అర్హత కోల్పోకుండా సవరణలు చేసింది. కొత్త, పాత ఇళ్లన్నీ 2-3 ఏళ్లలో నిర్మాణం పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇళ్ల కేటాయింపు జరుగుతుంది” అని మంత్రి పెమ్మసాని వెల్లడించారు.

## సీఎం రేవంత్‌తో పూర్తి
# అండర్‌స్టాండింగ్

మొదటిపేజీ తరువాయి

పీసీసీగా నాకు, సీఎం రేవంత్ లక్ష్యం. మంత్రులను గాంధీ భవన్‌లో.. ముఖాముఖి ఏర్పాటు చేసి ప్రజలకు మేలు చేయగలుగుతున్నాం. గాంధీ భవన్ వేదికగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం తోడ్పాటు అందించడం పీసీసీగా సంతృప్తిని ఇచ్చింది.

తెలంగాణలో కుల సర్వే చేయడం.. పార్టీ అధినేతగా అత్యంత సంతృప్తి కలిగింది. కర్ణాటకలో మా పార్టీ ప్రభుత్వం ఉన్నా.. అక్కడ బీసీ సీఎం ఉన్నా.. కుల సర్వే చేయలేకపోయారు, కానీ తెలంగాణలో చేశాం. దేశానికి తెలంగాణ రోల్ మోడల్ గా నిలిచింది. ఏఐసీసీ ర్యాంకింగ్ లో తెలంగాణ నెంబర్ 1గా నిలిచింది. 6 నెలల కింద మూడో స్థానం లో ఉండేది. ఏఐసీసీ ఇచ్చే ప్రతీ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేస్తున్నాం. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్ అనుకున్నాం. స్థానిక ఎన్నికల్లో 50 శాతం కంటే ఎక్కువ ఇవ్వగలిగాం.

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపిక కూడా అత్యంత పారదర్శకంగా సామజిక సమీకరణాలకు ప్రాధాన్యత ఇచ్చాం. రెండేళ్లలో వచ్చిన ఉప ఎన్నికల్లో విజయం సాధించాం. లోకల్ బాడీల్లో అత్యధిక మెజారిటీ స్థానాలు గెలిచాం. ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా జనం లోకి తీసుకెళ్లాం. వర్కింగ్ ప్రెసిడెంట్ల పదవుల నియామకం భర్తీ చేయలేకపోయాం. కార్పొరేషన్ పదవులు సకాలంలో అందరికి ఇవ్వలేకపోయాం అనే బాధ ఉంది. కార్పొరేషన్ పదవులను సెప్టెంబర్ నెలాఖరు లోపు భర్తీ చేస్తాం.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, నాకు మధ్య ఎక్కడా గ్యాప్ లేదు. మా ఇద్దరి మధ్య అండర్ స్టాండింగ్ ఉంది. పార్టీ పరంగా మేము ఇచ్చే సలహాలు ప్రభుత్వం కూడా తీసుకుంది. బీసీ మంత్రిని తొలగించినప్పుడు బాధ ఉన్నా.. కొన్ని సందర్భాల్లో క్రమశిక్షణ ముఖ్యం. అందులో భాగంగా కొండా సురేఖపై నిర్ణయం తీసుకున్నామని’ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

# మహిళా సంఘాల బలోపేతమే ధ్యేయం: సీతక్క

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత తమదేనని సీతక్క పేర్కొన్నారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు సంబంధించిన రూ.4 వేల కోట్లను ఎగ్గొట్టిందని ఆరోపించారు. మహిళా సంఘాలను బలోపేతం చేస్తున్నామని, 60 ఏళ్లు దాటిన మహిళలకు కూడా సంఘాల్లో అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు.

ఉచిత బస్సు ప్రయాణంపై కొందరు మహిళల మధ్య జరుగుతున్న చిన్నపాటి గొడవలను వీడియోలుగా చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారని సీతక్క విమర్శించారు. మహిళా సంక్షేమంతో పాటు వారి ఆర్థిక అభివృద్ధే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని చెప్పారు. త్వరలో అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేస్తామని మంత్రి వెల్లడించారు. కల్యాణలక్ష్మి పథకంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్‌ది రాజరిక వ్యవస్థ అని, అంటరానితనాన్ని ప్రోత్సహించే విధానాలను ఆ పార్టీ అనుసరిస్తోందని సీతక్క విమర్శించారు.

# ‘తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి’

మొదటిపేజీ తరువాయి

సమావేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో తమ రాష్ట్రాల్లో విలీనమైన ప్రాంతాల చారిత్రక సందర్భాలను అధికారికంగా నిర్వహిస్తున్న విధంగానే తెలంగాణలో కూడా సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఏకగ్రీవంగా కోరారు.

సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజు: బండారు దత్తాత్రేయ

ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో అత్యంత కీలకమైన రోజు అని అన్నారు. నిజాం నిరంకుశ పాలనలో తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న అణచివేత, దోపిడీ, హింసను ఆయన వివరించారు.

కాసిం రజ్వీ నేతృత్వంలోని రజాకార్లు ప్రజలపై సాగించిన దమనకాండ, హింస, నరమేధాన్ని ఆయన ప్రస్తావించారు. సుమారు 13 నెలల పాటు రజాకార్ల అరాచకంతో తెలంగాణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.

అప్పటి కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ దృఢమైన నాయకత్వంలో భారత సైనిక బలగాలు చేపట్టిన చర్యలతో నిజాం పాలనకు ముగింపు పలికి, తెలంగాణ ప్రాంతం భారత సమాఖ్యలో విలీనం అయిందని చెప్పారు. ఈ పరిణామంతో తెలంగాణ ప్రజలు నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పొందారని పేర్కొన్నారు.

తెలంగాణ విమోచన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆ చారిత్రక ఘట్టాన్ని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని దత్తాత్రేయ గారు అన్నారు.

**చరిత్రను మరచిపోకూడదు: విద్యాసాగర్ రావు**

మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్. విద్యాసాగర్ రావు, మాట్లాడుతూ, తెలంగాణ విమోచన చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తాను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న సమయంలో బైరాన్‌పల్లి గ్రామాన్ని సందర్శించిన విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. రజాకార్ల దమనకాండకు బైరాన్‌పల్లి ఒక విషాద సాక్ష్యంగా నిలిచిందని, అక్కడ జరిగిన ఘటనలు తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న కష్టాలను, త్యాగాలను ప్రతిబింబిస్తాయని తెలిపారు.

తెలంగాణ విమోచన పోరాట చరిత్రను రాజకీయాలకు అతీతంగా చూడాలని, నిజానిజాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాలని ఆయన అన్నారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడం ద్వారా తెలంగాణ చరిత్ర, విమోచన పోరాటంలో అమరులైన వారి త్యాగాలకు సముచిత గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు.

ఇతర వక్తలు మాట్లాడుతూ, సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడం ద్వారా తెలంగాణ చరిత్రను ప్రజలకు, ముఖ్యంగా యువతకు మరింత చేరువ చేయవచ్చన్నారు. తెలంగాణ విమోచనకు సంబంధించిన చారిత్రక ఆధారాలను సేకరించి, పరిశోధనలు ప్రోత్సహించి, పాఠ్యాంశాలు మరియు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా భావితరాలకు చరిత్రను పరిచయం చేయాలని సూచించారు.

తెలంగాణ విమోచన దినాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు, సెప్టెంబర్ 17ను రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించాలని సమావేశం ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో చరిత్రకారులు, సామాజికవేత్తలు, రాజకీయ నాయకులు, మేధావులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

## యూపీఐ చెల్లింపులకు ఛార్జీలు..
# ట్రంప్‌ను బుజ్జగించేందుకేనా?

మొదటిపేజీ తరువాయి

రూ.2000 వరకు ఉండే యూపీఐ లావాదేవీల పై బ్యాంకులు/పేమెంట్ సర్వీసు ప్రొవైడర్లు ఛార్జీలు వసూలు చేయరాదని కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌పై కాంగ్రెస్ స్పందించింది. యూపీఐ చెల్లింపులకు ఛార్జీలు.. ట్రంప్‌ను బుజ్జగించేందుకేనా..? కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. రూ.2వేలు దాటిన యూపీఐ లావాదేవీలపై ఫీజులు విధించడానికి కేంద్రం నిశ్శబ్దంగా మార్గం సుగమం చేసిందంటూ విమర్శించారు.

“దేశంలో రూ.2వేలు దాటిన యూపీఐ లావాదేవీల సంఖ్య 5 శాతం మాత్రమే అయినప్పటికీ.. అవి మొత్తం విలువ పరంగా సుమారు 65 శాతం వాటాను కలిగి ఉన్నాయి. భారత్‌లోని జీరో ఎండీఆర్ పాలసీని అమెరికా పేమెంట్ కంపెనీలు ఎప్పటినుంచో వ్యతిరేకిస్తున్నాయి. ఆ కంపెనీల ఆకాంక్షలకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం విధానంలో మార్పు చేసుకుంటోంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం విషయంలో రాజీ పడిన ప్రధాని మోదీ.. మరోసారి అమెరికా ఒత్తిడికి లొంగిపోతున్నారు. ఆకాశాన్నంటుతున్న ద్రవ్యోల్బణం కారణంగా సామాన్యుడి జేబులు ఇప్పటికే ఖాళీ అయ్యాయి. టోకు ద్రవ్యోల్బణం 10 శాతానికి చేరువలో ఉండగా.. ‘డిజిటల్ చెల్లింపుల పన్ను’ విధించడం ద్వారా ప్రజల మిగిలిన పొదుపును కూడా ప్రభుత్వం నాశనం చేయాలని ప్రణాళిక వేసింది. పదేళ్ల క్రితం పెద్ద నోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ కొట్టింది.

పెద్ద నోట్ల రద్దు వల్ల కలిగే వినాశకరమైన పరిణామాలపై ప్రశ్నలు తలెత్తినప్పుడు.. డిజిటల్ చెల్లింపులను, నగదు రహిత ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికే పెద్ద నోట్లు రద్దు చేశామని ప్రభుత్వం వాదించింది. రూ.5 వేల లావాదేవీలపై రూ. 25, రూ.10వేల లావాదేవీలపై రూ.50 వరకు పన్ను విధించే అవకాశం ఉందని నివేదికలు చెపుతున్నాయి.. ఇది నిజమేనా? ఎండీఆర్.. ద్వారా వ్యాపారులపై పడే అదనపు భారం చివరికి పెరిగిన ధరల రూపంలో సగటు వినియోగదారుడిపైనే పడుతుందని ప్రభుత్వం గ్రహించడం లేదా? ద్రవ్యోల్బణంతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించాల్సింది పోయి, మోదీ ప్రభుత్వం ప్రతిరోజూ వారి జేబులు ఖాళీ చేయడానికి కొత్త కొత్త మార్గాలను అన్వేషిస్తోంది” అని కాంగ్రెస్ నేతలు దుయ్యబట్టారు.

# యువత చెప్పేది వినేందుకు మేం సిద్ధం: నిర్మలా

మొదటిపేజీ తరువాయి

మనం దేశం కోసం ఏం చేశామని ప్రశ్నించుకోవాలని సూచించారు. తమిళనాడు లోని డాక్టర్ ఎం.జి.ఆర్. ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ.. ఈ వ్యాఖ్యలు చేశారు.

‘మిమ్మల్ని మీరు జెన్‌జీ, జెన్ ఆల్ఫా అని పిలుచుకున్నా సరే.. మీరు చెప్పేది వినడానికి మేమంతా సిద్ధంగా ఉన్నాం. కానీ మీ చుట్టూ ఏం జరుగుతోంది? అందులో మీ పాత్ర ఏమిటి?, మీరు దేశం కోసం ఏం సాధించవచ్చు? అనే విషయాల గురించి తప్పక ఆలోచించాలి. దేశ ప్రయోజనాల విషయంలో ఎప్పుడూ రాజీ పడకూడదు. దేశం సురక్షితంగా, బలంగా ఉంటేనే మనం నివసించడానికి ఒక ఇల్లు ఉంటుంది. పలు ప్రపంచ దేశాల్లో యుద్ధాలు, ఘర్షణల కారణంగా పౌరులు నిర్వాసితులుగా మారుతున్న పరిస్థితులను మనం చూస్తున్నాం. కానీ మనకు ఆ పరిస్థితి లేదు.

ట్రంప్ మా హామీలను కాపీ చేస్తున్నారు: డీకే శివకుమార్

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం , పశ్చిమాసియాలో ఘర్షణలు వంటి అనిశ్చితుల వల్ల ప్రపంచ దేశాల్లో ముడి చమురు, గ్యాస్, ఎరువుల సరఫరా ప్రభావితం అవుతోంది. అయినప్పటికీ భారత్ అన్ని పరిస్థితులను ఎదుర్కొని.. 7.8 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. ప్రధాని మోదీ నేతృత్వంలోని బలమైన ప్రభుత్వమే ఈ స్థిరత్వానికి కారణం. యువత కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పిస్తోంది. జీవితంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా.. ధైర్యంగా ముందుకు సాగాలి. అప్పుడే అనుకున్నది సాధించగలం’ అని నిర్మలా సీతారామన్ విద్యార్థులకు సూచించారు.

## తెలంగాణలో సెప్టెంబర్ 17 నుంచి వర్షాలు..
# ఈ మూడు జిల్లాల వాళ్లు జాగ్రత్త

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో మరోసారి వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హైదరాబాద్ కేంద్రం తెలిపింది. సెప్టెంబర్ 17 నుంచి 22 వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా సెప్టెంబర్ 19, 20 తేదీల్లో కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో ఈ రెండు రోజుల్లో 64.5 మిల్లీమీటర్ల నుంచి 115.5 మిల్లీమీటర్ల వరకు భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది.

అలాగే సెప్టెంబర్ 21, 22 తేదీల్లో తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు భారీ వర్ష సూచనను వాతావరణ శాఖ జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల సమయంలో అవసరమైతే తప్ప బయటకు వెళ్లకపోవడం మంచిదని అధికారులు సూచిస్తున్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే సీఎం ప్రజావాణి ధ్యేయం..



రాష్ట్రం నలుమూలల నుంచి వస్తున్న ప్రజల సమస్యల పరిష్కారమే “సీఎం ప్రజావాణి” ధ్యేయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్, సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి స్పష్టం చేశారు. (మంగళవారం) మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో నిర్వహించిన 255వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో ఆమె చర్చించారు.

ప్రజలు ప్రస్తావించిన సమస్యలను గద్వాల్ విజయలక్ష్మి ఓపికతో విని వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అర్జీలపై ప్రత్యేకంగా నోట్స్ రాసి అధికారులతో ఫోన్లో మాట్లాడి ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆమె కృషి చేశారు. ప్రజావాణికి వెళితే సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకంతో ఉన్న ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా అధికారులు అంకితభావంతో కృషి చేయాలని తెలిపారు.

సీఎం ప్రజావాణిలో ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, హోం శాఖల అంశాలపై అర్జీలు ఎక్కువగా నమోదు అవుతున్నాయని ఆమె పేర్కొన్నారు. మండలం, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నట్లు గద్వాల్ విజయలక్ష్మి ఈ సందర్భంగా కొనియాడారు.

కాగా మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు 23, విద్యుత్ శాఖకు 8, బీసీ సంక్షేమ శాఖకు 7, ఇతర శాఖలకు 36 కలిపి మొత్తం 74 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏసిపి ఉమేందర్, ప్రవాసి ప్రజావాణి నుంచి మంద భీమ్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ‘80’s ట్రెండ్’అని ఫోటో పోస్ట్ చేసి.. కటకటాల్లోకి..



వెంకి పెళ్లి సుబ్బిసావుకొచ్చింది అనే సామెత మనం తరచుగా వాడుతుంటాం... సరిగ్గా అటువంటి సన్నివేశమే ఇక్కడ సరిగ్గా సరిపోయింది. ఇటీవల 80’80’ం ట్రెండ్ పేరుతో సోషల్ మీడియాలో పిక్స్ పెట్టడం పెద్దఎత్తున వైరల్‌గా మారాయి. ఆ ట్రెండ్‌ని ఫాలో అవుతూ ఒక మహిళ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టగా.. అదే తనను కటకటాల్లో పెట్టేలా చేసింది. దీంతో తలపట్టుకోవడం ఆ మహిళ వంతైంది.

వివరాల్లోకి వెళితే... మధ్యప్రదేశ్ ఉజ్జయినిలో 45 ఏళ్ల క్రితం ఓ స్వర్ణకారుడి దుకాణంలో ఒక మహిళ హారం దొంగలించి పరారైంది, అనంతరం తన పేరు మార్చుకుని వేరే ప్రాంతంలో జీవనం సాగిస్తోంది. అయితే ఇదిలా ఉండగా ఇటీవల వైరల్‌గా మారిన 80’S ట్రెండ్‌లో పాల్గొని తన ఫోటోను కూడా 80’ం ట్రెండ్‌కు అనుగుణంగా మార్చి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అది చూసిన స్వర్ణకారుడు తన దుకాణంలో దొంగతనం చేసింది ఈమె అంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.దీంతో ఈ కేసును రీఓపెన్ చేసిన పోలీసులు తనను పట్టుకొని విచారించగా తానే దొంగతనం చేసినట్టు ఒప్పుకుంది. దీంతో తనను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో వెంకి పెళ్లి సుబ్బి సావుకు రావడం అంటే ఇదేనేమో అని నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం సెప్టెంబర్ 16,2026

# వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

» విద్య, వైద్య రంగాలను మరింత బలోపేతం చేయాలి

» ప్రజలకు మరింత చేరువయ్యేలా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలి

» సమగ్ర జిల్లా అభివృద్ధే ధ్యేయంగా అధికారులు మరింత బాధ్యతతో పని చేయాలి

» అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలి

» వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, దిశా కమిటీ చైర్ పర్సన్ డా. కడియం కావ్య






**కరపత్రం ప్రతినిధి బ్యూరో, సెప్టెంబర్ 15**
జిల్లా అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశా) కమిటీ చైర్ పర్సన్ డా.కడియం కావ్య అధికారులను అదేశించారు. మంగళవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, పురోగతిపై జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశా) కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశా) కమిటీ చైర్ పర్సన్ డా.కడియం కావ్య, ఘనపూర్ (స్టేషన్) ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజమహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోం, దిశా కమిటీ సభ్యురాలు కేసిరెడ్డి మాధవి, దిశా కమిటీ సభ్యులు బక్క శ్రీను, కొర్ర వెంకటేష్ నాయక్, జనగామ మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, ఘనపూర్ (స్టేషన్) మున్సిపల్ ఛైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ.. జిల్లాలో విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందించడం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తీసుకుంటున్న ప్రత్యేక చొరవ అభినందనీయమని వరంగల్ పార్లమెంట్ సభ్యులు, దిశా కమిటీ చైర్ పర్సన్ డా.కడియం డా.కడియం కావ్య పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి, అర్హులైన లబ్ధిదారులకు వాటి ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల కింద మంజూరు చేసిన మూడు నెలల్లో పనులు ప్రారంభం కాకపోతే వెంటనే వాటిని రద్దు చేయాలని, వినియోగించిన నిధులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నవీకరించాలని అధికారులను ఆదేశించారు.

**వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించిన పారక్వాట్ గడ్డి మందు వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని, పారక్వాట్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**విద్య, వైద్య రంగాలపై సూచనలు**
పిల్లల్లో మానసిక వైకల్యాన్ని పాఠశాల స్థాయిలోనే గుర్తించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మానసిక సమస్యలను తగ్గించేందుకు సరైన శిక్షణ, మార్గదర్శకత్వం అందించాలని చెప్పారు. విద్యార్థుల్లో రక్తహీనతను అంగన్‌వాడీ, ప్రీ-ప్రైమరీ దశ నుంచే గుర్తించాలని, పోషకాహారం, అవసరమైన మందులు అందించడంతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. జాతీయ రహదారి--163లో మిస్సింగ్ సర్వీస్ రోడ్ల నిర్మాణ పురోగతిపై నేషనల్ హైవేస్ అధికారుల ద్వారా వివరణ అడిగి తెలుసుకున్నారు. రాఘవాపురం వద్ద వర్షపు నీరు జాతీయ రహదారిపై నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. చాగల్, ఘనపూర్, పెద్దపెండ్యాల ప్రాంతాల్లో నిర్మించిన సైడ్ డివైడర్లు ఉపయోగకరంగా లేవని పేర్కొని, వాటిని సరిచేయాలని ఆదేశించారు.

**మాదకద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు**
జిల్లాలో మాదకద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని సూచించారు. అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, గుడ్ టచ్--బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే అమలు చేస్తున్న కార్యక్రమాలతో పాటు మరిన్ని వినూత్న ఆలోచనలను ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. కొత్త కార్యక్రమాలను కేవలం ప్రారంభించడమే కాకుండా, వాటి ప్రయోజనాలు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లేలా సమర్థవంతమైన అవగాహన, ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతమవుతాయని వెల్లడించారు. ఈ దిశా సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, కిరణ్ ప్రకాష్, మునిసిపల్ కమిషనర్లు రాజశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో కాప్రా ప్రెస్ క్లబ్‌లో వినాయక చవితి వేడుకలు







• ఆధ్యాత్మికతతో పాటు జర్నలిస్టుల ఐక్యత, సామాజిక స్ఫూర్తిని చాటిన వేడుకలు

• ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి ,సెప్టెంబర్ 15,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా:**
వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కాప్రా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాత్రికేయులు, ప్రెస్ క్లబ్ సభ్యులు ఒక చోట చేరి విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు పాత్రికేయుల ఐక్యత, సోదరభావం, సామాజిక స్ఫూర్తిని ప్రతిబింబించేలా కార్యక్రమం కొనసాగింది. వేడుకల్లో భాగంగా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య సంప్రదాయ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వినాయకుడికి పుష్పాలు, పండ్లు, ఉండ్రాళ్లు తదితర సంప్రదాయ నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. విఘ్నేశ్వరుడిని జ్ఞానం, విజ్ఞానం, శ్రేయస్సును ప్రసాదించే దేవుడిగా కొలుస్తారని, ప్రతి శుభకార్యానికి ముందు వినాయకుడిని పూజించడం ఆనవాయితీగా వస్తోందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి పండుగకు ఆధ్యాత్మికంగానే కాకుండా సాంస్కృతికంగా కూడా ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. విఘ్నేశ్వరుడిని జ్ఞానం, విజ్ఞానానికి ప్రతీకగా భావిస్తామని, జీవితంలో ఎదురయ్యే విఘ్నాలను తొలగించి సుఖ సంతోషాలు, ఐశ్వర్యం, ఆయురారోగ్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తామని తెలిపారు. వినాయక చవితి సందర్భంగా సమాజంలో సానుకూలత, ఐక్యత, సోదరభావం పెంపొందేలా ప్రతి ఒక్కరూ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. పాత్రికేయులందరూ కలిసి ఒకే వేదికపై పూజా కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా పరస్పర ఆత్మీయత మరింత బలపడిందన్నారు. పూజా కార్యక్రమంలో భాగంగా వినాయకుడికి వివిధ రకాల పుష్పాలు, పండ్లు, ఉండ్రాళ్లు తదితర నైవేద్యాలను సమర్పించారు. సంప్రదాయ పద్ధతుల్లో పూజలు నిర్వహిస్తూ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు కోరారు. అనంతరం పాల్గొన్న జర్నలిస్టులు, భక్తులు, ప్రెస్ క్లబ్ సభ్యులకు ప్రసాదం పంపిణీ చేశారు. కాప్రా సర్కిల్‌కు చెందిన పలువురు జర్నలిస్టులు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ప్రెస్ క్లబ్ ప్రాంగణం భక్తి వాతావరణంతో కళకళలాడింది. వినాయక చవితి సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఎర్రని తివాచీలు, చెట్ల ఆకుల కొమ్మలు తీగలతో అందంగా అలంకరించారు. ఈ వేడుకలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమానికే పరిమితం కాకుండా స్థానిక జర్నలిస్టుల మధ్య ఐక్యత, పరస్పర సహకారం, సామాజిక బాధ్యతను చాటిచెప్పేలా జరిగాయి. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితంలో జ్ఞానం, శ్రేయస్సు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని, సమాజంలో శాంతి, ఐక్యత నెలకొనాలని ప్రెస్ క్లబ్ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాసం మహిపాల్ రెడ్డి, నేమూరి మహేష్ గౌడ్‌తో పాటు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మెరుగు చంద్ర మోహన్, సలహాదారులు బెలిదె అశోక్, ఎంపల్లి పద్మారెడ్డి ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు శనిగరం అశోక్,మాజీ అధ్యక్షుడు పటేల్ నరసింహ, మాజీ కోశాధికారి యాటరాజు, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, ఉపాధ్యక్షులు యావాపురం రవి, గోవిందుకుంట్ల ఆంజనేయులు, కోశాధికారి రామచంద్ర మూర్తి, దొమ్మాటి కిరణ్ కుమార్ రావు, సంయుక్త కార్యదర్శి డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా తొడుపునూరు బాలకృష్ణ, సీనియర్ జర్నలిస్టులు పలుగుల పవన్, బస్వంత్ రెడ్డి, సింగం రాజు, మమత తదితరులు పాల్గొన్నారు.

# భూ రీసర్వేలో పారదర్శకత పాటించాలి

▪ రైతులకు అవగాహన కల్పించిన కలెక్టర్ సత్య శారద





**కరపత్రం ప్రతినిధి వరంగల్,సెప్టెంబర్ 15**
భూ రీసర్వే ప్రక్రియలో రైతుల సమక్షంలోనే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి,భూ వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.ఖిలా వరంగల్ మండలం వసంతపూర్‌లో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె పాల్గొని రైతులకు రీసర్వేపై అవగాహన కల్పించారు.భూముల హక్కులు,సరిహద్దులు,విస్తీర్ణం తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పక్కాగా నమోదు చేయడమే రీసర్వే లక్ష్యమన్నారు.రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని,ఏవైనా అభ్యంతరాలు లేదా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.రీసర్వే సమయంలో రైతులు అధికారులకు సహకరించాలని కోరారు.అనంతరం వరంగల్ మండలం కొత్తపేటలో జరుగుతున్న ఫీల్డ్ రీసర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు.రైతులతో కలిసి భూముల సరిహద్దులు,సర్వే వివరాల నమోదును పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.భవిష్యత్‌లో భూ వివాదాలకు అవకాశం లేకుండా స్పష్టమైన భూ రికార్డులు రూపొందించాలని సూచించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ)కె.కిషోర్ కుమార్,ఆర్డీవో సుమ,ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు,తహసీల్దార్లు శ్రీకాంత్,ఇక్బాల్,రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం: కేటీఆర్

▪ ప్రతిపక్షాలపై, సామాన్యులపై దాడులు జరుగుతున్నాయని ఆరోపణ

▪ కేసీఆర్ నివాసంపై దాడి ఘటనపై కోర్టును ఆశ్రయిస్తాం



**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, సెప్టెంబర్ 15**
కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో అన్ని రంగాల్లో విఫలమైందని, ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజలపై కూడా దాడులు జరుగుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాసంపై దాడికి ప్రయత్నించడం, దానిని అడ్డుకునేందుకు వెళ్లిన ఎమ్మెల్యేలను పోలీసులు నిర్బంధించడం ఆందోళనకర పరిణామమని ఆయన పేర్కొన్నారు.పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఢిల్లీ చేరుకున్న కేటీఆర్‌ను ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏఎన్ఐ ప్రతినిధి కలవగా, కేటీఆర్ తాజా పరిణామాలపై మాట్లాడారు. కేసీఆర్ నివాసం వద్ద చోటుచేసుకున్న ఘటనపై బీఆర్ఎస్ నేతలు, ఎమ్మెల్యేలు స్పందించిన తీరును ప్రస్తావిస్తూ ప్రభుత్వ వైఖరిపై కేటీఆర్ విమర్శలు చేశారు. అదేవిధంగా పండుగ రోజున సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు తన పీఆర్వో మహేష్, పీఏ మహేందర్ రెడ్డిని పిలిపించి దాడికి పాల్పడ్డారంటూ కేటీఆర్ ఆరోపించారు. ఈ ఘటనపై ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని ఆయన పేర్కొంటూ, ఇది రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తోందని అన్నారు.తమపై జరిగిన అన్యాయానికి సంబంధించి న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తామని, అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షాల గొంతును అణచివేసే ప్రయత్నాలు సరికావని ఆయన వ్యాఖ్యానించారు. కేటీఆర్ వెంట బీఆర్ఎస్ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్ రావు తదితరులు ఉన్నారు.

# సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

▪ కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికెట్ల ప్రదానం



▪ ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ అభ్యర్థులకు అవకాశం

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, సెప్టెంబర్ 15**
నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో డిప్లొమా, పీజీ సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ కోసం తెలంగాణ వ్యాప్తంగా అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విమలా రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ డిప్లొమా, ఇంజనీరింగ్ చదువుతున్న లేదా పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్,పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్, మాస్టర్ ప్రోగ్రామ్ ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్, తదితర కోర్సుల్లో శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. శిక్షణ కాలపరిమితి 5 నుంచి 10 నెలల వరకు ఉంటుందని, కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన వారికి భారత ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేస్తామని సంస్థ పేర్కొంది. ప్రస్తుతం ఐటీ, సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్‌కేర్, ఈ-కామర్స్ రంగాల్లో సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, పెనెట్రేషన్ టెస్టర్, సెక్యూరిటీ ఆర్కిటెక్ట్ వంటి విభాగాల్లో దేశ, విదేశాల్లో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని డైరెక్టర్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి www.nationalcybersecurityacademy.org వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని లేదా మరిన్ని వివరాలకు 7893141797 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

• కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి,వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయి

• హన్మకొండకు మహా అభివృద్ధి ప్రణాళిక

• పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం..అశోక హోటల్ ఎదురుగా మల్టీలెవల్ పార్కింగ్

• హనుమకొండ చౌరస్తా రీడెవలప్‌మెంట్‌కు కార్యాచరణ..అండర్ డ్రైనేజీ,వాటర్ వర్క్స్‌కు ప్రాధాన్యం



**కరపత్రం ప్రతినిధి వరంగల్/హన్మకొండ,సెప్టెంబర్ 15**
వరంగల్: హనుమకొండ నగర సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి,కొనసాగుతున్న పనులను వేగవంతం చేయాలని కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి,హనుమకొండ జిల్లా కలెక్టర్,కుడా వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పేయి అధికారులను ఆదేశించారు.మంగళవారం కుడా కార్యాలయంలో అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.నగరంలో ప్రధాన సమస్యగా ఉన్న పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.అశోక హోటల్ ఎదురుగా మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటు చేసే ప్రతిపాదనపై చర్చించారు.అలాగే హనుమకొండ చౌరస్తాను ఆధునీకరించి రీడెవలప్‌మెంట్ చేసేందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని సూచించారు.నగరంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ,వాటర్ వర్క్స్ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.కుడా పరిధిలోని వరంగల్ బస్‌స్టేషన్,ఇన్నర్ రింగ్‌రోడ్,వేయి స్తంభాల గుడి అభివృద్ధి,ఉనికిచర్ల ప్రాంత అభివృద్ధి,ఔటర్ రింగ్‌రోడ్,ఎన్‌హెచ్ గ్రీనరీ తదితర పనుల పురోగతిని సమీక్షించారు.భూసేకరణ అవసరమైన పనులకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసి,అభివృద్ధి పనులకు ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇక భద్రకాళి ప్రాంతం,వరంగల్ కోట,దేవునూరు గుట్టల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పర్యాటక, చారిత్రక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలను అభివృద్ధి చేయడం ద్వారా నగరానికి మరింత ఆకర్షణ తీసుకురావాలని పేర్కొన్నారు.అన్ని పనులను సమన్వయంతో చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో కుడా పీఓ అజిత్‌రెడ్డి,ఈఈ భీమ్‌రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ మత్తులో యువత భవిష్యత్తు ఛిద్రమవుతోంది

» మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజం సమష్టిగా కదలాలి

» భావి భారత నిర్మాతలైన యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

» మాజీ కార్పొరేటర్లు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ బైరబోయిన ఉమా – దామోదర్ యాదవ్



**కరపత్రం ప్రతినిది వరంగల్, సెప్టెంబర్ 15**

దేశ భవిష్యత్తును నిర్మించాల్సిన యువత మాదకద్రవ్యాల మాయలో చిక్కుకుని తమ జీవితాలను నాశనం చేసుకుంటుండటం అత్యంత ఆందోళనకరమైన పరిణామమని మాజీ కార్పొరేటర్లు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ బైరబోయిన ఉమా – దామోదర్ యాదవ్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ వినియోగం ఒక వ్యక్తి జీవితాన్ని మాత్రమే ప్రభావితం చేసే సమస్య కాదని, దాని ప్రభావం కుటుంబం నుంచి సమాజం వరకు విస్తరించి, యువత భవిష్యత్తుతో పాటు దేశ ప్రగతిపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి యువతే రేపటి భారతదేశానికి వెన్నెముక అని అన్నారు. విద్య, విజ్ఞానం, సాంకేతికత, క్రీడలు, పరిశోధన, ఉపాధి, పారిశ్రామిక రంగాల్లో అద్భుతమైన అవకాశాలను అందిపుచ్చుకుని దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాల్సిన యువత మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కావడం బాధాకరమన్నారు. క్షణికమైన ఆనందం, స్నేహితుల ఒత్తిడి, ఆసక్తి, సరదా పేరుతో మొదలయ్యే మాదకద్రవ్యాల వినియోగం క్రమంగా తీవ్రమైన వ్యసనంగా మారి వ్యక్తి ఆలోచనా శక్తిని, ఆరోగ్యాన్ని, ఆర్థిక పరిస్థితిని, కుటుంబ సంబంధాలను దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.యువతను మత్తు పదార్థాల నుంచి కాపాడటం కేవలం పోలీసుల బాధ్యతగానో, ప్రభుత్వ బాధ్యతగానో చూడకూడదని, ఇది యావత్ సమాజం తీసుకోవాల్సిన సామాజిక బాధ్యత అని వారు అన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వాటి వినియోగానికి దారితీసే కారణాలపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక నష్టాలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. యువతలో ప్రతిభకు కొదవ లేదని, సరైన దిశానిర్దేశం లభిస్తే వారు అద్భుతమైన విజయాలను సాధించగలరని పేర్కొన్నారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సృజనాత్మక రంగాలు, విద్య, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సేవ వంటి నిర్మాణాత్మక కార్యక్రమాల వైపు యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి యువతకు మార్గనిర్దేశం చేయాలని కోరారు.

**తల్లిదండ్రుల పాత్ర కీలకం**

యువత డ్రగ్స్‌కు బానిస కాకుండా చూడటంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని బైరబోయిన ఉమా – దామోదర్ యాదవ్ అన్నారు. పిల్లలపై కేవలం చదువు, ఉద్యోగం, భవిష్యత్తు లక్ష్యాల విషయంలోనే కాకుండా వారి మానసిక స్థితి, స్నేహ సంబంధాలు, రోజువారీ అలవాట్లు, ప్రవర్తనలో వచ్చే మార్పులపై కూడా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని సూచించారు. పిల్లలతో భయపెట్టే విధంగా కాకుండా స్నేహపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకునే వాతావరణాన్ని కుటుంబంలో కల్పించాలని అన్నారు.డ్రగ్స్ వినియోగానికి గురైన వారిని సమాజం వెలివేయడం పరిష్కారం కాదని, వారికి అవసరమైన వైద్య సహాయం, మానసిక సహకారం, కుటుంబ అండదండలు అందించి తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి ప్రయత్నించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యసన విముక్తి కేంద్రాలు, నిపుణుల సహాయం, కౌన్సెలింగ్ సేవలపై యువతకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరి భాగస్వామ్యం**

మాదకద్రవ్యాల నిర్మూలన ఒక్కరోజు నిర్వహించే అవగాహన కార్యక్రమాలతో సాధ్యం కాదని, నిరంతర సామాజిక ఉద్యమంగా కొనసాగాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. డ్రగ్స్ సరఫరా చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు యువతను ఆ ఉచ్చులోకి లాగుతున్న వ్యవస్థను అడ్డుకోవాలని కోరారు. ప్రజలు కూడా తమ పరిసరాల్లో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై అప్రమత్తంగా ఉండి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. “యువత చేతిలో పుస్తకం ఉండాలి.. నైపుణ్యం ఉండాలి.. లక్ష్యం ఉండాలి.. మత్తు పదార్థం ఉండకూడదు” అనే స్పష్టమైన సందేశం సమాజంలోకి వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. యువత తమ విలువైన జీవితాన్ని డ్రగ్స్ కోసం త్యాగం చేయకుండా, తమలోని ప్రతిభను గుర్తించి లక్ష్య సాధన కోసం కష్టపడాలని పిలుపునిచ్చారు.భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే శక్తి యువతలోనే ఉందని, అలాంటి యువత ఆరోగ్యంగా, ఆత్మవిశ్వాసంతో, బాధ్యతాయుతంగా ఎదిగినప్పుడే బలమైన సమాజం, శక్తివంతమైన దేశం నిర్మాణం సాధ్యమవుతుందని బైరబోయిన ఉమా – దామోదర్ యాదవ్ అన్నారు. డ్రగ్స్, మాదకద్రవ్యాలను పూర్తిగా విడనాడి కుటుంబానికి, సమాజానికి, దేశానికి ఆదర్శంగా నిలవాలని యువతకు వారు పిలుపునిచ్చారు.

# ఆమిర్ అలీ ఖాన్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

» కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో 'సియాసత్' కీలక పాత్ర రజా అఫ్సాన్



**కరపత్రం ప్రతినిది వరంగల్,సెప్టెంబర్ 15**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో 'సియాసత్' దినపత్రిక,దాని న్యూస్ ఎడిటర్ ఆమిర్ అలీ ఖాన్ కీలక పాత్ర పోషించారని మెకానికల్ ఇంజనీర్,యూత్ కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ రజా అఫ్సాన్ అన్నారు. 2023 ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు,మండలాల్లో పర్యటించి సభలు,కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తూ ముస్లింలను కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని ఆమిర్ అలీ ఖాన్ పిలుపునిచ్చారని తెలిపారు.'సియాసత్'ద్వారా ముస్లింల సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువచ్చి రాజకీయ చైతన్యం కల్పించారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆమిర్ అలీ ఖాన్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేయడంతో ముస్లింలలో ఆనందం నెలకొందని రజా అఫ్సాన్ అన్నారు.అయితే సుమారు ఏడాదిన్నర తర్వాత ఆయన స్థానంలో అజహరుద్దీన్‌ను ఎమ్మెల్సీగా నామినేట్ చేయడం ముస్లింలలో అసంతృప్తికి దారితీసిందని పేర్కొన్నారు.ఈ వ్యవహారం ప్రస్తుతం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు.నవంబర్‌లో ఖాళీ కానున్న ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకదాన్ని ఆమిర్ అలీ ఖాన్‌కు కేటాయించి న్యాయం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి,టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో పాటు కాంగ్రెస్ అధిష్ఠానానికి రజా అఫ్సాన్ విజ్ఞప్తి చేశారు.2023లో ముస్లింలు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచారని,2028లోనూ ఆ మద్దతు కొనసాగాలంటే ఆమిర్ అలీ ఖాన్‌కు తిరిగి ఎమ్మెల్సీ అవకాశం కల్పించి ముస్లింలలో నెలకొన్న అసంతృప్తిని తొలగించాలని కోరారు.స్థానిక సంస్థలు,కార్పొరేషన్ ఎన్నికలతో పాటు 2028 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇది కాంగ్రెస్‌కు ప్రయోజనం చేకూరుస్తుందని అన్నారు.

# సివిల్ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ ఎక్స్‌పోతో విద్యార్థుల ప్రతిభకు వేదిక

» బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో ఘనంగా 'ఇంజనీర్స్ డే” వేడుకలు

**కరపత్రం ప్రతినిది బ్యూరో, సెప్టెంబర్ 15**

భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే వేడుకలను బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్), నర్సంపేటలో ఘనంగా నిర్వహించారు. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యం, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15న “సివిల్ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో”, హ్యాకథాన్ నిర్వహించారు. ఎక్స్‌పోలో విద్యార్థులు సివిల్ ఇంజనీరింగ్ రంగానికి సంబంధించిన వినూత్న ప్రాజెక్టులు, నమూనాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. విద్యార్థుల్లో స్వీయాత్మకత, సాంకేతిక పరిజ్ఞానం, సమస్య పరిష్కార నైపుణ్యాలు, ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎక్స్‌పోలో నీటి వనరుల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, నిర్మాణ సాంకేతికత, రవాణా వ్యవస్థలు, స్మార్ట్ సిటీలు, సుస్థిర అభివృద్ధికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. ప్రాజెక్టుల రూపకల్పనలో విద్యార్థులు ప్రదర్శించిన సాంకేతిక అవగాహన, సృజనాత్మకత, ఆచరణాత్మక దృక్పథం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ ఇరిగేషన్ అండ్ క్యాడ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇంజి. బి. సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, వాటిని ఆచరణలోకి తీసుకువచ్చే విధంగా సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ రంగంలో నూతన ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం













ఎంతో కీలకమని, విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే వినూత్న ప్రాజెక్టుల రూపకల్పనపై దృష్టి సారించాలని అన్నారు.ఇంజనీర్స్ డే సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి బిట్స్ ప్రిన్సిపాల్ డా. వి.ఎస్. హరిహరన్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్య అనేది కేవలం పుస్తక పరిజ్ఞానానికి పరిమితం కాకుండా, సమాజంలోని సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను చూపించేలా ఉండాలని అన్నారు. విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని, సృజనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ఇలాంటి ప్రాజెక్ట్ ఎక్స్‌పోలు, హ్యాకథాన్‌లు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిట్స్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డా. ఎ. రాజేందర్ ప్రసాద్ రెడ్డి, సెక్రటరీ డా. జి. రాజశేఖర్ రెడ్డి, బిట్స్ ప్రిన్సిపాల్ డా. వి.ఎస్. హరిహరన్, అకడమిక్ కో–ఆర్డినేటర్ డా. వి. నారాయణ, ఏవో డా. ఎస్. సురేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రమశిక్షణ, అకడమిక్ ప్రగతితో పాటు సాంకేతిక పరిజ్ఞానం, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన అన్ని అవకాశాలను కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి పి. సుధీర్ కుమార్ కన్వీనర్‌గా వ్యవహరించారు. ఇంజనీరింగ్ డే సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజెక్టుల ద్వారా సమాజానికి ఉపయోగపడే పరిష్కారాలను అందించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత నూతన ఆలోచనలతో ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాల్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రాజెక్టులను ప్రదర్శించారు.

# ఇనామ్ సభకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ఆహ్వానం

» ఇండియన్ నేషనల్ ఈస్ట్ మూమెంట్ ఇనామ్ ఆధ్వర్యంలో

» అక్టోబర్ 3న మోటూరి కృష్ణ ప్రసాద్ సంస్మరణ సభకు ఆహ్వానం



**కరపత్రం ప్రతినిది వరంగల్,సెప్టెంబర్ 15**

వరంగల్: ఇండియన్ నేషనలిస్ట్ మూమెంట్ (ఇనామ్) అధ్యక్షుడు మోటూరి కృష్ణ ప్రసాద్ సంస్మరణ సభను అక్టోబర్ 3న నిర్వహించనున్న నేపథ్యంలో..వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని ప్రత్యేక ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఇనామ్ ప్రతినిధులు ఆహ్వానించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే అధికారిక నివాసానికి వెళ్లిన ఇనామ్ ప్రతినిధులు సభకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని అందజేసి, కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని కోరారు.మోటూరి కృష్ణ ప్రసాద్ సేవలను స్మరించుకుంటూ నిర్వహించనున్న సంస్మరణ సభకు ఎమ్మెల్యే ప్రత్యేక ముఖ్య అతిథిగా హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఓం బ్రహ్మం, బాలరాజు, రామబ్రహ్మం,అయూబ్ మహమ్మద్, నూనా అప్పారావు,అఫ్జల్ మొహియుద్దీన్,డాక్టర్ రాజ్ మహమ్మద్, అబూబకర్(అడ్వకేట్)కాజీపేట మాజీ కార్పొరేటర్ తదితరులు పాల్గొన్నారు.

# పేద వర్గాల సంక్షేమానికి పెద్దపీట

▪ నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే లక్ష్యం

▪ త్వరలో చిల్పూర్‌లో మండల కార్యాలయాలకు శంకుస్థాపన

▪ మల్లన్నగండి రిజర్వాయర్ ద్వారా అన్ని గ్రామాలకు గోదావరి జలాలు

**కరపత్రం ప్రతినిది స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 15**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద, నిరుపేద వర్గాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.చిల్పూర్ మండల కేంద్రంలోని వరలక్ష్మి గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిల్పూర్ మండలానికి చెందిన 32 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ.32,03,712 విలువైన చెక్కులను, 27 మంది ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు రూ.9,73,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వాల సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొత్త పథకాలను






అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అప్పుల వాయిదాలు, వడ్డీలు చెల్లిస్తూనే పేద వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.రైతులకు రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం, సన్న వడ్లకు బోనస్, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మద్దతు ధర, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ వంటి చర్యలతో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఇల్లు లేని నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నామని తెలిపారు. నియోజక వర్గంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.చిల్పూర్ మండల కేంద్రంలో త్వరలోనే మండల కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు కడియం శ్రీహరి వెల్లడించారు. అలాగే శ్రీ బుగులు వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడతామని తెలిపారు. మల్లన్నగండి రిజర్వాయర్ ద్వారా చిల్పూర్ మండలంలోని అన్ని గ్రామాలకు గోదావరి జలాలను అందించేందుకు కృషి చేస్తానన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి రెండు పంటలకు సాగునీరు అందించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.